



ఆదోనిలో కొనసాగుతున్న మెడికల్ కళాశాల నిర్మాణం



నిర్మాణంలో మెడికల్ కా..లేజీ

● సాగుతున్న మెడికల్ కాలేజీ భవన నిర్మాణాలు ● ఏడాది గడిచినా పూర్తైన పనులు 15 శాతమే

● ఆదోనిలో వేధిస్తున్న నీటి సమస్య ● కర్నూలులో పనులు అంతంతే

కర్నూలు జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన ఆదోనికి వైద్య కళాశాల, బోధనాస్పత్రులు మంజూరయ్యాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించేలా రూ.475 కోట్లతో వివిధ భవనాల నిర్మాణ పనులు ప్రారంభించారు. 420 బెడ్లతో కూడిన బోధనాస్పత్రి ఇది. 13.31 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో బోధనాసుపత్రి, మెడికల్ కాలేజీ, రెసిడెన్షియల్ స్టాఫ్ క్వార్టర్స్, నర్సింగ్ కాలేజీ, విద్యార్థుల వసతి గృహాలు, జూనియర్, సీనియర్ రెసిడెన్షియల్ హాస్టల్, నర్సింగ్ విద్యార్థుల వసతి గృహం, వర్కింగ్ స్టాఫ్ నర్స్ క్వార్టర్స్, హాస్టల్, సెంట్రల్ కిచెన్, డైనింగ్, ఎంజీపీఎస్ ప్లాంట్ రూమ్స్, లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్, బయో మెడికల్ వేస్ట్ ప్లాంట్ రూమ్స్, సెంట్రల్ డ్రగ్ స్టోర్, లాండ్రీ, మార్చురీ.. వంటి భవనాలు నిర్మించాల్సి ఉంది. ఈ పనులను కాంట్రాక్ట్ విజయవాడకు చెందిన కేఎంవీ గ్రూప్ సంస్థ దక్కించుకుంది. ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) పర్యవేక్షణలో పనులు చేపట్టారు. బోధనాస్పత్రి కోసం రూ.475 కోట్లు ప్రభుత్వం మంజూరు చేస్తే.. అందులో సివిల్ పనుల (ఆయా భవనాలు) కోసం రూ.350 కోట్లు కేటాయించారు. 2021 మే 31న సీఎం జగన్ వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. అయితే వివిధ కారణాలు వల్ల పనుల ప్రారంభంలో జాప్యం జరిగింది. 30 నెలల్లో పూర్తి చేసేలా ఏపీఎంఎస్ఐడీసీతో 2022 డిసెంబరు 26న కాంట్రాక్ట్ సంస్థ ఒప్పందం చేసుకుని పనులు చేపట్టింది.



ఆదోని మెడికల్ కాలేజీ హాస్టల్ భవన నిర్మాణం

కర్నూలు బోధనాస్పత్రిలో ఐపీడీ బ్లాక్ భవనాలు నిర్మాణం



కర్నూలు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతంలో ఆదోని వైద్య కళాశాల, బోధనాస్పత్రులు మంజూరయ్యాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో పారంభించేలా రూ.475 కోట్లతో కళాశాల వివిధ భవనాల నిర్మాణాలు చేపట్టారు. 420 బెడ్స్ బోధనాస్పత్రి ఇది. 13.31 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో బోధనాసుపత్రి, మెడికల్ కాలేజీ, రెసిడెన్షియల్ స్టాఫ్ క్వార్టర్స్, నర్సింగ్ కాలేజీ, విద్యార్థుల వసతి గృహాలు, జూనియర్, సీనియర్ రెసిడెన్షియల్ హాస్టల్, నర్సింగ్ విద్యార్థుల వసతి గృహం, వర్కింగ్ స్టాఫ్ నర్స్ క్వార్టర్స్, హాస్టల్, సెంట్రల్ కిచెన్, డైనింగ్, ఎంజీపీఎస్ ప్లాంట్ రూమ్స్, లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్, బయో మెడికల్ వేస్ట్ ప్లాంట్ రూమ్స్, సెంట్రల్ డ్రగ్ స్టోర్, లాండ్రీ, మార్చురీ.. వంటి భవనాలు నిర్మించాల్సి ఉంది. ఈ పనుల కాంట్రాక్ట్ విజయవాడకు చెందిన కేఎంవీ గ్రూప్ సంస్థ దక్కించుకుంది. ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) పర్యవేక్షణలో చేపట్టారు. బోధనాస్పత్రి కోసం రూ.475 కోట్లు ప్రభుత్వం మంజూరు చేస్తే.. అందులో సివిల్ పనులు (ఆయా భవనాలు) కోసం రూ.350 కోట్లు కేటాయించారు. 2021 మే 31న సీఎం జగన్ వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. అయితే వివిధ కారణాలు వల్ల పనుల ప్రారంభంలోజాప్యం జరిగింది. 30 నెలల్లో పూర్తి చేసేలా ఏపీఎంఎస్ఐడీసీతో 2022 డిసెంబరు 26న కాంట్రాక్ట్ సంస్థ ఒప్పందం చేసుకుని పనులు చేపట్టింది.

13 నెలల్లో 15 శాతం పురోగతి..



కర్నూలు జీజీహెచ్‌లో మందకొడిగా సాగుతున్న నిర్మాణాలు

కాంట్రాక్ట్ ఒప్పందం మేరకు 30 నెలల్లో 13.31 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో వివిధ భవన నిర్మాణాలు పూర్తి చేసి ఏపీఎంఎస్ఐడీఐసీకి అప్పగించాలి. అయితే నల్లరేగడి నేల కావడంతో వర్షాకాలంలో ఆశించిన స్థాయిలో పనులు జరగకపోవడం, సకాలంలో బిల్లులు రాకపోవడం వంటి కారణాలతో నిర్మాణాలు మందగించాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.225 కోట్లు కేటాయిస్తే.. గత జూన్ నాటికి రూ.20 కోట్లు విలువైన సివిల్ పనులు పూర్తి చేశారు. సోమవారం నాటికి 15 శాతం అంటే దాదాపు రూ.55 కోట్ల విలువైన పనులు చేసినట్లు సమాచారం. కళాశాల, అత్యవసర విభాగం, హాస్టల్.. వంటి భవన నిర్మాణాల పనులు ఇప్పుడిప్పుడు వేగం పుంజుకున్నాయి. ఇక మిగిలిన నిర్మాణ పనులు పునాదులు, పిల్లర్ల దశ దాటి స్లాబ్‌లు వేస్తున్నారు. గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయాలంటే ప్రతి నెలా సగటున రూ.10-15 కోట్లకు పైగా విలువైన పనులు చేయాలి. ప్రభుత్వం కూడా అదే స్థాయిలో బిల్లులు క్రమం తప్పక చెల్లించి కాంట్రాక్టరును ప్రోత్సహించాలి. అయితే ప్రస్తుతం జరుగుతున్న పురోగతి పరిశీలిస్తే నెలకు రూ.4-5 కోట్లకు మించి విలువైన పనులు జరగడం లేదని తెలుస్తుంది. మిగిలిన సమయం కేవలం 17 నెలలే. ఇలాగైతే 2025 జూన్ ఆఖరు నాటికి పూర్తి చేయడం అసాధ్యమే. ప్రస్తుతం ఆదోనిలో కాలేజీ నిర్మాణాలకు నీటి సమస్య వేధిస్తోంది. శాశ్వత పరిష్కారానికి పులికనుమ జలాశయం నుంచి నీటిని తీసుకోవడానికి వీలుగా పైపులైన్, ఫిల్టర్స్, విద్యుత్ సరఫరా వంటి పనుల కోసం దాదాపు రూ.20-25 కోట్లు నిధులు అవసరమని అంచనా. ఇందుకు సంబంధించి డీపీఆర్ తయారు చేస్తున్నారు.

● ఫేజ్-1 కింద ఐపీడీ బ్లాక్ ఒక్కటే..!

కర్నూలు మెడికల్ కళాశాల (కేఎంసీ), ప్రభుత్వ సర్వజన వైద్యశాల (బోధనాస్పత్రి) బలోపేతం పనులు రూ.500 కోట్లతో చేపట్టారు. ఈ నిధులు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం సమకూర్చాల్సి ఉంది. ఈ పనులు కాంట్రాక్ట్ కూడా కేఎంవీ సంస్థనే దక్కించుకుంది. ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లతో 2023 ఫిబ్రవరి 1న ఒప్పందం చేసుకున్నారు. ఓపీడీ బ్లాక్, క్యాజువాలిటీ, ఐపీడీ బ్లాక్, మెడికల్ కాలేజీ, క్యాంటిన్, లెక్చరర్ గ్యాలరీ, మోడ్రన్ మార్చురీ, బయో మెడికల్ వేస్ట్ ప్లాంట్, సెక్యూరిటీ బిల్డింగ్.. వంటి భవనాలు 15.09 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించాల్సి ఉంది. ఈ పనుల కోసం రూ.266 కోట్లు కేటాయించారు. మిగిలిన నిధులు రూ.235 కోట్లు వైద్య పరికరాలు, యంత్రసామగ్రి, ఫర్నీచర్ కోసం కేటాయించారు. ప్రస్తుతం ఫేజ్-1 కింద ఐపీడీ బ్లాక్ బేస్‌మెంట్ ఫ్లోర్, గ్రౌండ్ ఫ్లోర్ కలిపి 1.65 లక్షల చదరపు అడుగులు, లెక్చరర్ గ్యాలరీ 20,577 చదరపు అడుగుల నిర్మాణాలు మాత్రమే చేపట్టారు. ఇందుకోసం రూ.65 కోట్లు కేటాయిస్తే మంజూరు చేసింది రూ.44 కోట్లే. అందులో రూ.41 కోట్లు విలువైన పనులు చేసినట్లు ఇంజనీర్లు పేర్కొంటున్నారు. ఎంతో కీలకమైన ఐపీడీ బ్లాక్ భవన నిర్మాణాలు నత్తతో పోటీ పడుతున్నాయి. ఇప్పటికీ కేవలం 40 శాతానికి మించి పనులు పూర్తి కాలేదు. మార్చి ఆఖరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యం. జరుగుతున్న పనులను పరిశీలిస్తే ఈ గడువులోగా పూర్తి అవుతాయా..? అన్నది ప్రశ్నార్థకమే. అంతేకాదు పూర్తి స్థాయిలో 15.09 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో బోధనాస్పత్రి, మెడికల్ కాలేజీ భవనాల నిర్మాణాలు 2025 జూలై 31లోగా పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఫేజ్-1 కింద చేపట్టిన ఐపీడీ బ్లాక్, లెక్చరర్స్ గ్యాలరీ పనులు గడువులోగా పూర్తి చేస్తామని పనులు పర్యవేక్షిస్తున్న ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్ పేర్కొన్నారు.



ఆదోని మెడికల్ కాలేజీలో వివిధ భవనాల నిర్మాణాలు ఇలా...

ఇప్పటికీ 15 శాతం పనులు పూర్తి చేశాం


ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణం పనులు కేఎంవీ సంస్థ చేపట్టింది. ఒప్పందం ప్రకారం 30 నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది. నల్లరేగడి నేల కావడంతో వర్షాకాలంలో ఆశించిన స్థాయిలో పనులు జరగలేదు. వేసవిలో పనులు వేగం పెంచుతాం. నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి పులికనుమ రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ నిర్మాణానికి అవసరమైన డీపీఆర్ తయారు చేస్తున్నారు. గడువులోగా పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.

- శివారెడ్డి, ఈఈ,
ఏపీఎంఎస్ఐడీసీ, ఆదోని

నాలుగున్నరేళ్లలో నష్టపోయాం

● నేతల ఎదుట వైసీపీ కార్యకర్తల గగ్గోలు
● సమావేశానికి కప్పట్రాళ్ల వర్గీయులు దూరం

దేవనకొండ, ఫిబ్రవరి 5: అధికార వైసీపీలో కార్యకర్తల నుంచి కీలక నేతల వరకూ ధిక్కార స్వరం వినిపిస్తోంది. నియోజకవర్గ సమన్వయకర్తలుగా బాధ్యతలు తీసుకున్న నాయకులకు కార్యకర్తల నుంచి ప్రతికూల పరిస్థితులే ఎదురవుతున్నాయి. తాజాగా ఆలూరు నియోజకవర్గంలోని దేవనకొండ మండలంలో వైసీపీ కార్యకర్తలు నియోజకవర్గ ఇన్‌చార్జి విరూపాక్షి ఎదుట ఏకరువు పెట్టారు. నాలుగున్నర సంవత్సరాల్లో ఎంతో నష్టపోయాం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు దేవనకొండ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కర్నూలు నగర మేయర్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఆలూరు సమన్వయకర్త విరూపాక్షి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలో కీలక నాయకులు వ్యవహరిస్తున్న కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఆమె భర్త రామచంద్రనాయుడు, జడ్పీటీసీ రామకృష్ణ, కప్పట్రాళ్ల మద్దిలేటి నాయుడుతో పాటు వారి వర్గీయులు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. సమావేశం ప్రారంభం కాగానే కార్యకర్తలు ఒక్కసారిగా తమ ఆవేదనను వెల్లగక్కారు. కార్యకర్తలను వైసీపీ నాయకులెవరూ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగాల పేరిట డబ్బు వసూలు చేసేవారికి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారికే పార్టీలో గుర్తింపు ఉందన్నారు. నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరిగిందన్నారు. దీంతో వారిని బీవై రామయ్య, విరూపాక్షిలు సముదాయించాల్సి వచ్చింది.



ఐఐఐటీడీఎం సంస్థకు మౌలిక సదుపాయాలను కల్పించండి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 5: జగన్నాథగట్టుపై ఉన్న ట్రిపుల్ఐటీ డీఎంకు మౌలిక సదుపాయాలను త్వరితగతిన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్ జి.సృజనను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. సోమవారం సాయంత్రం విజయవాడ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఐఐటీ, ఐఐఐటీడీఎం, ఎయిమ్స్‌ల నిర్మాణాల పురోగతిపై సీఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా కర్నూలు జగన్నాథగట్టుపై ఉన్న ఐఐఐటీడీఎంకు అవసరమైన మౌలిక సదుపాయాలపై కలెక్టర్‌తో చర్చించారు. మౌలిక సదుపాయాల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటున్నామనీ, ముఖ్యంగా సంస్థ ప్రహరీ నిర్మాణానికి సంబంధించి జనవరి 31 నాటి నుంచి పనులు ప్రారంభించినట్లు కలెక్టర్ తెలిపారు. శాశ్వతమైన తాగునీటి సరఫరా పనులు, సంస్థ భవన సముదాయం మీదుగా వెళ్లే హైటెన్షన్ విద్యుత్ లైన్లు మార్చేందుకు సంబంధించిన పనులు టెండరు దశలో ఉన్నాయన్నారు. ముఖ్యంగా అప్రోచ్ రోడ్డు వెంట వీధి లైట్ల ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐఐఐటీడీఎం డైరెక్టర్ డాక్టర్ వీవీఎల్ఎన్ సోమయాజులు, రిజిస్ట్రార్ కే.గురుమూర్తి, డీఆర్వో మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ఆగిన రిజిస్ట్రేషన్లు



గంటల తరబడి మొరాయిస్తున్న సర్వర్లు

కల్లూరు, ఫిబ్రవరి 5: కర్నూలు జిల్లాలోని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సాంకేతిక కారణాలు తలెత్తడంతో రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోయాయి. సోమవారం గంటల తరబడి సర్వర్లు మొరాయించడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ స్తంభించిపోయి క్రయ, విక్రయదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. గంటల తరబడి అప్లికేషన్లు ఓపెన్ కాకపోవడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగడం లేదని అధికారులు తెలిపారు. రిజిస్ట్రేషన్ సేవల కోసం కార్యాలయాలకు వచ్చిన ప్రజలు, మహిళలు కూర్చోవడానికి కుర్చీలు లేక, తాగడానికి నీరు లేక కనీసం మరుగుదొడ్ల సదుపాయం కన్పించక పోవడంతో మహిళలు నరకం చూశారు. సర్వర్లు మొరాయించడంతో కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరగక జనం వెనుదిరిగారు. మరో పక్క కార్డు ప్రైమ్ 2.0 విధానం అమల్లోకి వచ్చిన తర్వాత తరచూ రిజిస్ట్రేషన్లు జరగక వినియోగదారులు అవస్థలు పడ్డారు. రిజిస్ట్రేషన్ల కోసం వృద్ధులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేదు. కాని ఇంటి వద్దకు వెళ్ళి రిజిస్ట్రేషన్ చేసేందుకు అధికారులు పెద్దఎత్తున డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో నగదు ఇచ్చుకోలేని కొందరు వృద్ధులను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు తీసుకురావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సోమవారం ఒక వృద్ధురాలిని మెట్లపై తీసుకెళ్లేందుకు నలుగురు వ్యక్తులు కష్టపడ్డారు. తీరా రిజిస్ట్రేషన్ కాకపోవడంతో ఉసురుమంటూ వెనుదిరిగారు. వినియోగదారుల సమస్యలను అధికారులు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో నిరీక్షిస్తున్న జనాలు

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

డీఐజీ సీహెచ్ విజయరావు

బాధ్యతల స్వీకరణ

కర్నూలు, ఫిబ్రవరి 5: రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాల్లో శాంతిభద్రతలను పరిరక్షించడమే ప్రధాన లక్ష్యమని కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు వెల్లడించారు. సోమవారం కర్నూలు నగరంలోని డీఐజీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ టీమ్ వర్క్‌గా పని చేస్తామన్నారు. ఇతర శాఖల అధికారులతో కలిసి ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించుకుంటామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన డీఐజీని కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల ఎస్పీలు జి.కృష్ణకాంత్, రఘువీర్ రెడ్డి, సిద్ధార్థ కౌశల్, ఎస్పీ కృష్ణారావు, హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, డీఎస్పీలు, సీఐలు మర్యాదపూర్వకంగా కలిశారు.

హంగామా చేసిన పోలీసు అధికారులు

డీఐజీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పోలీసు అధికారులు కాస్త హంగామా చేశారు. డీఐజీగా బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి చేసిన ఏర్పాట్లు చర్చనీయాంశమైంది. వేద పండితులు పూర్ణకుంభాలతో స్వాగతం పలకడం.. మేళతాళాల నడుమ స్వాగతం పలికారు. మత పెద్దలతో ఆశీర్వచనాలు, పూజలు చేయించడం చర్చనీయాంశంగా మారింది.



డీఐజీ నేపథ్యమిదీ...

2010 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన డీఐజీ విజయరావుది సొంత జిల్లా పశ్చిమగోదావరి. 2010లో అప్పా హైదరాబాదులో పని చేశారు. 2012లో వరంగల్ కమిషనర్ ఆఫ్ పోలీసుగా, 2013లో అనంతపురం అసాల్ట్ కమాండర్ గ్రేహౌండ్స్‌లో, 2014లో రంపచోడవరం ఏఎస్పీగా, 2015లో సీఐడీ ఏఎస్పీగా, 2016లో ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా పని చేశారు. 2017 గుంటూరు అర్బన్ ఎస్పీగా, 2019లో విజయవాడ డిప్యూటీ కమిషనర్‌గా, 2020లో విజయవాడ రైల్వేలో రైల్వే ఎస్పీగా, 2021లో నెల్లూరు ఎస్పీగా, 2023లో మూడో బెటాలియన్ కమాండెంట్‌గా పని చేశారు. ఇటీవలే డీఐజీగా పదోన్నతి పొంది కర్నూలు వచ్చారు.





పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న కర్నూలు, నంద్యాల ఎస్పీలు

ఓపీ కిటకిట



రోగులు, వారి సహాయకులతో కిక్కిరిసిన ఆసుపత్రి ప్రాంగణం





భుజాలపై చేయి వేసుకొని రోగిని తీసుకొస్తున్న సహాయకులు



రోగిని స్ట్రెచర్‌పై తీసుకెళ్తున్న బంధువులు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓపీ రోగులు కిటకిటలాడారు. సోమవారం ఓపీలకు 2696 మంది రోగులు పోటెత్తారు. ఇందులో 298 మంది అడ్మిషన్లు పొందారు. ఆసుపత్రి అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా ఓపీ టికెట్ల కోసం ఉదయం నుంచే రోగులు బారులు తీరారు. ఉదయం 9 గంటలకు ఓపీ కోసం క్యూలైన్లలో నిలబడి 11 గంటలైనా ఓపీ టికెట్లు ఇవ్వడం లేదని కొందరు రోగులు మండిపడుతున్నారు.

- కర్నూలు(హాస్పిటల్)

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కర్నూలు

కిక్కిరిసిన ఓపీ క్యూలైన్



బిల్లులు రావని భయం

- మధ్యలో నిలిచిపోయిన ప్లాట్‌ఫారం పనులు
- రేకులు బిగించేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు


నిలిచిపోయిన ప్లాట్‌ఫారం పనులు

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 5: పనులు చేస్తే బిల్లులు రావని కాంట్రాక్టర్లు భయపెడుతున్నారు. దీంతో టెండర్లలో పాల్గొనడానికి ముందుకు రావడం లేదు. కర్నూలులో రైతుల సౌకర్యార్థం రూ.6 కోట్లు ఖర్చు పెట్టి ఆధునిక ప్లాట్‌ఫారం నిర్మాణాన్ని చేపట్టేందుకు గత సంవత్సరం మార్కెటింగ్ శాఖ రాష్ట్ర అధికారులు టెండర్లు పిలిచారు. 8 శాతం లెస్సుతో హైదరాబాదుకు చెందిన ఒక కాంట్రాక్టరు ఈ పనిని దక్కించుకున్నాడు. అయితే ఈ ఆళ్లగడ్డకు చెందిన ఓ సబ్ కాంట్రాక్టరు మెయిన్ కాంట్రాక్టర్ కొంత డబ్బు ముట్టజెప్పి పనులు చేస్తున్నాడు. ఇప్పటికి దాదాపు రూ.2 కోట్ల దాకా ఖర్చు చేశాడు. మొదటి బిల్లు కింద రూ.1.30 కోట్లు అధికారులు కాంట్రాక్టరుకు చెల్లించారు. సెప్టెంబరులో రూ.30 లక్షలు, వారం క్రితం మరో రూ.60 లక్షలు చెల్లించేందుకు అధికారులు మార్కెటింగ్ శాఖ రాష్ట్ర అధికారులకు ఫైలు పంపారు. అయితే.. సీఎంఎఫ్ నుంచి నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ప్లాట్‌ఫారం నిర్మాణానికి సంబంధించి సివిల్ వర్క్ దాదాపు పూర్తయిందని అధికారులు తెలిపారు. ఆ తర్వాత చివరి దశలో రేకులు ఏర్పాటు చేసే పని కోసం గత రెండు నెలల నుంచి గుంటూరులోని మార్కెటింగ్ శాఖ అధికారులు ఇప్పటికి నాలుగు సార్లు కాంట్రాక్టర్లను ఆహ్వానిస్తూ టెండర్లను పిలిచారు.

● ఆ పనులు చేయలేం:

రేకులు బిగించే పని కోసం నాలుగు సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ అటువైపు చూడకపోవడంతో చివరి దశ పని ఎప్పుడు చేపడతారో, ఎప్పుడు పూర్తవుతుందోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. ప్రస్తుత రబీకి రైతులకు అందుబాటులోకి రావాల్సిన ప్లాట్‌ఫారం కనీసం వచ్చే ఖరీఫ్ జూన్ నాటికైనా పూర్తి చేసి తమకు అందుబాటులోకి తీసుకు రావాలని రైతులు కోరుతున్నారు. అయితే.. ప్రస్తుతం సివిల్ వర్క్ పనులు చేసిన కాంట్రాక్టరుకు చేసిన పనికి సంబంధించి సక్రమంగా బిల్లులు అందకపోవడంతో ఆ కాంట్రాక్టరు గుంటూరులోని మార్కెటింగ్ శాఖ కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్నాడు. ఈ పరిస్థితిని గుర్తించిన కొంత మంది కాంట్రాక్టర్లు కొత్తగా చేపట్టాల్సిన రేకుల బిగింపు పనులను తాము దక్కించుకున్నా పని పూర్తయిన తర్వాత బిల్లులు సకాలంలో అందిస్తారో లేదోనని టెండరు ప్రక్రియలో పాల్గొనడం లేదు. ఈ విషయంపై సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు మాట్లాడుతూ త్వరలోనే ప్లాట్‌ఫారం నిర్మాణాన్ని పూర్తి చేస్తామని, నిధుల సమస్య లేదని, కాంట్రాక్టరును ఒప్పించి పని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

- సీజ్ చేసిన 110 బంగారు అంగళ్లను తెరిపించాలి
- కార్పొరేషన్ కార్యాలయం దాకా ర్యాలీ, ధర్నా



షరాఫ్‌బజార్ నుంచి కార్పొరేషన్‌కు ర్యాలీగా వస్తున్న దుకాణ యజమానులు, వ్యాపారులు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 5: నగర పాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యం వీడి షరాఫ్ బజార్‌లో సీజ్ చేసిన అంగళ్లను తెరిపించాలని షరాఫ్‌బాజర్ హౌసింగ్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కామిశెట్టి గురువయ్య డిమాండ్ చేశారు. సోమవారం అంగళ్లను తెరిపించాలని కోరుతూ షరాఫ్‌బజార్ హౌసింగ్ కో ఆపరేటివ్ సొసైటీ, షరాఫ్‌బజార్ జ్యువెలరీ అసోసియేషన్ అధ్వర్యంలో కార్పొరేషన్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గురువయ్య మాట్లాడుతూ గత కమిషనర్ బాలాజీ ఉన్న సమయంలో షరాఫ్‌బజార్‌లో పార్కింగ్ స్థలం లేదని 110 అంగళ్లను సీజ్ చేశారని అన్నారు. ఇది జరిగి 30 నెలలు గడుస్తున్న అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అంగళ్లకు పార్కింగ్ స్థలం లేదనే ఒకే ఒక్క కారణంతో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండ సీజ్ చేయడం అన్యాయమన్నారు. అనంతరం స్పందనలో కమిషనర్ ఎ.భార్గవతేజకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జ్యువెలరీ అసోసియేషన్ అధ్యక్షుడు బెళగం టి రమణ, కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి వై.రమేష్, సొసైటీ కోశాధికారి జూటూరు రాము, ఉపాధ్యక్షుడు బచ్చు శేషయ్య, జయంతి శ్రీరాములు పాల్గొన్నారు.

కౌరవ సేనాని జగన్‌కు ఓటమి తప్పదు

- టీడీపీ కార్యాలయంలో సోమిశెట్టి వెంకటేశ్వర్లు


సమావేశంలో మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 5: కౌరసేనాని జగన్మోహన్‌రెడ్డికి పరాభవం తప్పదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి వస్తానని, తాను అర్జునుడినని, టీడీపీ, జనసేన పార్టీలను కౌరవసేనగా ఆయన పొరబడుతున్నారని అన్నారు. నిజానికి జగన్‌రెడ్డిదే కౌరవ సేన అని, వారికి రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదని అన్నారు. ఇప్పటికే జగన్ పాలనలో ఏ సామాజిక వర్గం సుఖంగా లేదని, దుష్టచతుష్టం గెలిచినట్లు చరిత్రలో ఎక్కడా లేదని, ప్రజలు చరమ గీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కౌరవసేనలో జగన్మోహన్ రెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల రామక్రిష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి దుష్టచతుష్టయం అని, వారు వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. ఎవరి వారు దొరికినంత దోచుకుని రాష్ట్రాన్ని దివాలా తీయించారని అన్నారు. కార్యక్రమంలో కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్, నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామక్రిష్ణుడు, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు హనుమంతరాయచౌదరి, ప్రొఫెషనల్ వింగ్ విభాగం కన్వీనరు పి. భరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యంతోనే సమస్యలు పరిష్కారం

- సాగు నీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి


దీక్షలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 5: సీమ ప్రజల చైతన్యం ద్వారానే రాయలసీమలోని సమస్యలు పరిష్కారం అవుతాయని రాయలసీమ సాగునీటి సాధనా సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం ఎదురుగా రాయలసీమ నిజ దర్శన దీక్ష నిర్వహించారు. రాయలసీమ పెండింగు ప్రాజెక్టులను పూర్తి చేయాలని, కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంత డిమాండ్లను పార్టీల ఎన్నికల మ్యానిఫెస్టోలలో చేర్చాలని కోరుతూ రాయలసీమ విద్యావంతుల వేదిక, రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ దీక్షకు ముఖ్య అతిథిగా దశరథ రామిరెడ్డి విచ్చేసి ప్రసంగించారు. ఈ దీక్షకు వేదిక నాయకుడు రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా, ముందుగా శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి దీక్ష శిబిరం ప్రారంభించారు. రైతు సంఘం నాయకుడు ఆది నారాయణరెడ్డి ధర్నాను ప్రారంభించారు. బొజ్జా దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల తరబడి రాయలసీమ అన్యాయానికి, మోసానికి, ప్రభుత్వ పెద్దల కుట్రలకు బలై పోతూ ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ భూముల్లో 25శాతం భూములకు మాత్రమే నీటి వసతి కల్పించారని, కేటాయించిన నికర జలాలు కూడా రాయలసీమకు రావడం లేదని ఆరోపించారు. రాయలసీమకు నష్టం కలిగించే 69 ఉత్తర్వులను రద్దు చేయాలని, ఆర్‌డీఎస్ కుడి కాలువ నిర్మాణాన్ని చేపట్టాలని, వేదవతి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని, 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మించాలని, కర్నూలులో మైనింగ్ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని, కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విరసం నాయకుడు పాణి మాట్లాడుతూ ఇంత కాలం అధికారంలో ఉన్న పార్టీలు, రేపు ఎన్నికల్లో గెలిచి అధికారం పొందాలని అనుకుంటున్న పార్టీలు అన్నీ రాయలసీమకు ద్రోహం చేశాయని అన్నారు. రాబోయే ఎన్నికల సందర్భంగా ప్రజల వద్దకు ఓట్ల కోసం వచ్చే నాయకులను సీమ సమస్యలపై నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో కందనోలు కృష్ణయ్య, సీమ విద్యార్థి సంఘం నాయకులు రవికుమార్, సీమకృష్ణ, కోనేటి వెంకటేశ్వర్లు, జేవీవీ బాధ్యుడు శివ శంకర్‌గౌడ్, సీపీఐ నాయకుడు రామకృష్ణారెడ్డి, లోక్‌సత్తా నాయకుడు డేవిడ్, న్యాయవాది హేమలతా రెడ్డి, ఎస్‌డీపీఐ నాయకులు చాంద్ బాషా, హంద్రీ పరిరక్షణ సమితి నాయకుడు రామాంజినేయులు, జనసేన పార్టీ నాయకుడు పవన్‌కుమార్, విద్యావంతుల వేదిక కన్వీనర్ భాస్కరరెడ్డి, డీటీఎఫ్ నాయకుడు రత్నం ఏసేపు పాల్గొన్నారు.

బుద్ధి ఉన్నవాళ్లెవరూ జగన్‌కు ఓటెయ్యరు

- వైసీపీ సర్పంచుల ఆగ్రహం


మండల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేస్తున్న వైసీపీ సర్పంచ్

హాలహర్వి, ఫిబ్రవరి 5: సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బుద్ధి ఉన్నవారెవ్వరూ ఓటెయ్యరని వైసీపీ సర్పంచులు ధ్వజమెత్తారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో వైసీపీ ప్రభుత్వం తీరుపై వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా అర్ధగేరి సర్పంచ్ గురునాథ్ రెడ్డి, బాపురం సర్పంచ్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ తీరు వల్ల గ్రామాల్లో సర్పంచులు చులకనైపోయామని అన్నారు. గ్రామాలను అభివృద్ధి చేస్తామని నమ్మి ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే, నిధులన్నీ ప్రభుత్వమే వాడుకోవడంతో పైసా పనులు చేయలేకపోతున్నామని ఆవేదన చెందారు. సొంత పార్టీపై విమర్శలు వస్తున్నా, అధికార పార్టీకి చెందిన జెడ్పీటీసీ లింగప్ప, ఎంపీటీసీ పెట్టి కంఠమ్మ మౌనం వహించారు.

మట్టి తవ్వకాలపై విజిలెన్స్ ఆరా

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 5: ఆవుటర్ రింగ్ రోడ్డు కోసం మట్టి తవ్వకాలపై గనుల శాఖ విజిలెన్స్ విభాగం పరిశీలించిందని డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. సోమవారం నగర శివారులో తవ్వకాలకు సంబంధించి ఇప్పటి వరకు ఎంత పరిమాణంలో తవ్వకాలు జరిపారనే దానిపై సర్వేలు నిర్వహించారు. దీనికి సంబంధించి రాయల్టీలు చెల్లించాలని కోరారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి పాల్గొన్నారు.

పెద్దపులి సంచారం

రుద్రవరం, ఫిబ్రవరి 5 : రుద్రవరం ఫారెస్టు సబ్ డివిజనులోని చెలిమ రేంజ్ పరిధిలో డి.కొట్టాలపై భాగంలోని పంట పొలాల్లో పెద్దపులి సంచరించినట్లు స్థానికులు సోమవారం తెలిపారు. పంట పొలాల వైపు వరుసగా నాలుగు రోజులు పెద్దపులి సంచరించిందన్నారు. దీంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. పంట పొలాలకు కాపలా వెళ్లాలంటే జంకుతున్నారు.

గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించారు

ఎమ్మెల్సీ బీటీ నాయుడు


అసెంబ్లీ సమావేశాలకు వెళ్తూ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 5: శాసన సభ, శాసన మండలి బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్‌తో సీఎం జగన్మోహన్‌రెడ్డి అబద్ధాలు చెప్పించారని ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. సోమవారం అమరావతి నుంచి ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. 127 అంశాలు, 34 పేజీలు సుదీర్ఘంగా అబద్ధ ప్రసంగాన్ని చేయించారన్నారు. విద్య, ఉపాధి, ఉద్యోగ రంగా లకు సంబంధించిన అంశాలను ఆయన వివరిస్తూ గవర్నర్‌తో ఉభయ సభను ఉద్దేశించి అబద్ధాలు వెల్లడిస్తుంటే ముఖ్యమంత్రి బల్లలు చరుస్తుంటే సభ్యులు కూడా అదే పని చేశారని అన్నారు. 5 సంవత్సరాలు పూర్తయినా ఒక్క జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని, డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులను భర్తీ చేస్తానని, మెగా డీఎస్సీని దగా డీఎస్సీగా మార్చారని ధ్వజమెత్తారు.

తప్పులను సవరించని అధికారులు

- ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు, మృతుల ఓట్లు
- ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు



ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 5: ఎన్నికల సంఘం ఇటీవల విడుదల చేసిన ఓటరు జాబితాలో ఉన్న తప్పులు సవరణకు నోచుకోలేదు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో గతంలో ఓట్లు ఎలా ఉన్నాయో ప్రస్తుతం అలాగే ఉన్నాయి. సాధారణంగా మృతి చెందిన వాళ్ల ఓట్లు, డబుల్ ఓట్లు, షిఫ్టింగ్ ఓట్లను బీఎల్ఓలు తొలగించాలి. అయితే పట్టణంలోని 19వ వార్డు, 32వ వార్డుల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో గతంలో ఎలా ఉన్నాయో ఇప్పుడు కూడా అలాగే ఉండటం గమనార్హం. 19వ వార్డులోని పోలింగ్ కేంద్రం 105లో ఇంటి నెం. 1-842-9 ఇంట్లో వడ్డె గిడ్డమ్మ, 1-856 ఇంటి నంబర్‌లో ఈరమ్మ వడ్డె, 1-843-55 ఇంట్లో కే ధనుంజయ, 1-805-68లో గొల్ల లక్ష్మమ్మ, 1-843లో లక్ష్మమ్మ, 1-1097లో జే నాగేశ్వరరావు మృతి చెందారు. ఓటరు జాబితాలో వీరి ఓటను తొలగించాల్సి ఉండగా కొత్త జాబితాలో అలాగే ఓట్లు వచ్చాయి. అలాగే 32 వార్డుకు చెందిన మంగలి ప్రతాప్‌పేరుపై పోలింగ్ కేంద్రం 116లోని ఓటరు జాబితాలో వరుస సంఖ్య 665తోపాటు 667లోను రెండు ఓట్లు ఉన్నాయి. అలాగే ఆదే వార్డు, అదే పోలింగ్ కేంద్రంలో వరుస సంఖ్య 1150, 1151లో ముల్లా సుభుర్ బాషా పేరుపై రెండు ఓట్లు ఉన్నాయి. మృతి చెందిన, డబుల్ ఎంట్రీ ఓట్లు ఉన్న వాటిని తొలగించాలని ఓటరు జాబితా సవరణకు ముందు స్థానికంగా ఉన్న టీడీపీ వార్డు ఇన్‌చార్జి శిల్పి భాస్కర్ బీఎల్‌ఓకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది.

వారి సేవలు మర్చిపోలేం

- డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర రెడ్డి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ప్రభాకర్ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 5: కరోనా కాలంలో నర్సులు ఎంతో కష్టపడ్డారని, తమ ప్రాణాలను కూడా ఫణంగా పెట్టి సేవలు అందించి కరోనా వారియర్స్‌గా నిలిచారని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి కొనియాడారు. సోమవారం సూపరింటెండెంట్ చాంబరులో ఏపీ నర్సింగ్ స్టూడెంట్ ఫెడరేషన్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కట్టడి చేసేందుకు డాక్టర్లతో పాటు నర్సులు అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. నర్సింగ్ గ్రేడ్-1 సూపరింటెండెంట్ రామతులసమ్మ మాట్లాడుతూ నర్సులు రోగులకు చికిత్స అందించడంతో పాటు వైద్యులు, ఇతర వైద్యనిపుణులకు సహాయం చేసి వైద్య రికార్డులను నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్లు నాగమణి, రాజ్యలక్ష్మి, అనుసూయ, ఏపీ నర్సింగ్ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్తకోట మోహన్, నాయకులు సురేంద్రబాబు పాల్గొన్నారు.

ప్రారంభమైన అర్చక శిక్షణ తరగతులు

మంత్రాలయం, ఫిబ్రవరి 5: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో గురు రాజాంగణ భవనంలో రెండు రోజుల అర్చకుల ట్రైనింగ్ అకాడమీలో శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభించారు. అర్చక ట్రైనింగ్ అకాడమీ డైరెక్టర్ డా.ఎస్. తనూజ్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, దేవదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు మాట్లాడుతూ అర్చకులు హుందాతనాన్ని, నిష్టను పాటించినప్పుడే ఆ గౌరవం దక్కుతుందన్నారు. సమావేశంలో మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతాచార్, అర్చక వెల్ఫేర్ ట్రస్టు బోర్డు మెంబర్ శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి


మాట్లాడుతున్న ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంగల్ రెడ్డి

కర్నూలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 5 : పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏపీ జేఏసీ ఛైర్మన్ వెంగల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కార్యాయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి 2 లక్షల నుంచి 4 లక్షల వరకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఉద్యోగుల సంఘాలతో పీఆర్సీ కమిటీ చర్చలు జరపాలని అన్నారు. పీఆర్సీ అమలు చేసే లోపు 30 శాతం ఐఆర్‌తోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 11వ తేదీ జేఏసీ ఆధ్వర్యంలో విజయవాడలో సర్వసభ్య సమావేశం, 12వ తేదీ నోటీసులు, 13వ తేదీ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కాశన్న, రామకృష్ణ, జనార్ధన్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

15న వక్తృత్వ పోటీలు

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 5: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న క్లస్టర్ యూనివర్శిటీ తెలుగు అధ్యయన శాఖ, కేవీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) సంయుక్త ఆధ్వర్యంలో నగర స్థాయిలో డిగ్రీ, ఇంటర్ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు నరసం జిల్లా కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీ దేవి, కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ సుబ్రహ్మణ్య కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఈనెల 15న ఉదయం 10.30 గంటలకు బి.క్యాంపులోని సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల్లో ప్రారంభమవుతాయని వారు పేర్కొన్నారు. డాక్టర్ జయలక్ష్మి నాయుడు, దీపక్ తేజ హాస్పిటల్ ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు ఉంటాయని వారు తెలిపారు. డిగ్రీ స్థాయిలో 'మహనీయుల జీవితం - మనకు అనుసరణీయం' అనే అంశం, ఇంటర్ స్థాయిలో 'వాడుకలో, బోధనలో, పాలనలో, మన తెలుగు' అనే అంశంపై ప్రసంగించాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు 5 నిముషాల వ్యవధిలో ప్రసంగించాలని సూచించారు. వివరాలకు సెల్ నెం. 94408 34017, 99667 53887లలో సంప్రదించాలని తెలిపారు.

స్వామి వారికి మూడు కిలోల వెండి


దాతలకు స్వామివారి ప్రసాదాలను అందిస్తున్న దృశ్యం

కౌతాళం, ఫిబ్రవరి 5: ఉరుకుంద ఈరన్న స్వామి వారికి సోమవారం రోజున ఓ భక్తుడు మూడు కిలోల వెండిని విరాళంగా ఇచ్చారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, పాలక మండలి అధ్యక్షుడు నాగరాజుగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వారికి ఆదోని వాస్తవ్యులైన క్రిష్ణ 3.240 కిలోల వెండి బిస్కెట్లను దేవాలయ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. దాతకు ఆలయ అధికారులు స్వామి వారి శేషవస్త్రాలు అందజేశారు.

మహానందీశ్వరుని సన్నిధిలో జొన్నవిత్తుల

మహానంది, ఫిబ్రవరి 5: మహానంది క్షేత్రంలో సోమవారం ప్రముఖ సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ముఖ మండపం వద్ద అర్చకులు స్వాగతం పలికారు. ప్రధాన ఆలయాల్లో మహానందీశ్వరునికి, కామేశ్వరీదేవి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన పూజలను భక్తి శ్రద్ధలతో జరిపారు. అనంతరం వీరిని వేద పండితులు అశీర్వదించారు. ఆలయ ఏఈఓ ఎర్రమల్ల మధు శాలువాతో సన్మానించి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా జొన్నవిత్తుల మాట్లాడుతూ తాను మహానందీశ్వరుని పాటలను రచించాలని సంకల్పించినట్లు తెలిపారు.


సినీ గేయ రచయిత జొన్నవిత్తులను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

ఆటో బోల్తా.. యువకుడి మృతి

తుగ్గలి, ఫిబ్రవరి 5: ఆటో అదుపు తప్పి బోల్తా పడటంతో.. యువకుడు రంజిత్ నాయక్ (20) మృతి చెందాడు. సోమవారం జి.ఎర్రగుడి, చెరువుతాండా గ్రామాల మధ్యలో అనంతపురం జిల్లా మైనాపురం గ్రామానికి చెందిన రామిరెడ్డి నాయక్, లక్ష్మీబాయిల కుమారుడు రంజిత్ నాయక్ గ్రామం నుంచి ఒక్కడే ఆటో తీసుకుని వెళ్తుండగా.. అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో అటువైపు వెళ్తున్న ప్రయాణీకులు క్షతగాత్రున్ని గుత్తి వైద్యశాలకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.



'పెట్రోల్ బంకులపై చర్యలు తీసుకోవాలి'

ఓర్వకల్లు, ఫిబ్రవరి 5: మండలంలోని పెట్రోల్ బంకులు నిబంధనలు అమలు చేయడం లేదని ఆయా యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు శ్రీధర్, మండల కార్యదర్శి షాజహాన్ శనివారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగే స్పందనలో ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ మండలంలో 9 పెట్రోల్ బంకులు ఉన్నాయని, ఆ బంకులో తాగునీరు, మరుగుదొడ్లు, మౌలిక సదుపాయాలు లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి బంకులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మద్దయ్య, లింగన్న, అంజి, దస్తగిరి, షాకీర్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

సర్పంచులను అడ్డుకోవడం సిగ్గుచేటు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 5: సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న సర్పంచులను అడ్డుకోవడం సిగ్గు చేటని గుట్టపాడు సర్పంచ్ టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉప్పలపాడు సర్పంచ్ అయ్యస్వామి విజయవాడకు వెళ్తుండగా.. కర్నూలు బస్టాండులో పోలీసులు అడ్డుకుని నోటీసులు జారీ చేశారని తెలిపారు. సర్పంచుల సమస్యల పరిష్కారానికై అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న వారిని అరెస్టు చేయించడం ప్రభుత్వానికి తగదన్నారు.

కర్నూలు(రూరల్): కర్నూలు రూరల్ మండలం బి.తాండ్రపాడు పంచాయతీ సర్పంచు ఆకెపోగు జయన్నను తాలుక పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఏపీ పంచాయతీ రాజ్ చాంబర్ ఆధ్వర్యంలో విజయవాడలో మంగళవారం జరిగే సర్పంచుల హక్కుల సాధనకై ఛలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.. ఈనేపథ్యంలో కోడుమూరు నియోజకవర్గం సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్న తాండ్రపాడు సర్పంచు జయన్నను తాలుకా పోలీసులు సోమవారం ముందస్తుగా తెల్లవారుజాము నుంచే హౌస్ అరెస్టు చేసి ఉదయం 11గంటలకు స్టేషన్‌కు తీసుకెళ్లారు.

గూడూరు: విజయవాడలో జరిగే అసెంబ్లీ ముట్టడికి వెళ్ళరాదంటూ టీడీపీ సర్పంచ్ జె నయోమికి కె నాగలాపురం పోలీసులు నోటీసులు అందజేసినట్లు సర్పంచ్ జె నయోమి తెలిపారు. సోమవారం నయోమి మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్న వైసీపీ ప్రభుత్వం తమ ఆగడాలు ఎక్కడ బయట పడతాయోనని భయంతోనే ముందస్తుగా నోటీసులు ఇచ్చారన్నారు.

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తులు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 5: మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో వెలసిన యాగంటీశ్వర, ఈశ్వర, చెన్నకేశవ, అంజనేయ, చౌడేశ్వరి దేవి అమ్మవార్ల దేవస్థానంలో నూతన ధర్మకర్తల నియామకం కోసం దరఖాస్తు చేసుకోవాలని కార్యనిర్వహణాధికారి మద్దిలేటి కోరారు. మొత్తం ఏడుగురు ధర్మకర్తల నియామకం కోసం నోటిఫికేషన్ జారీ చేశామని తెలిపారు. ధర్మకర్తల మండలిలో ఎస్సీ మహిళ ఒకరు, బీసీ మహిళ ఒకరు, ఎస్టీ మహిళ ఒకరు, ఓసీ మహిళ ఒకరు, నాయీ బ్రాహ్మణులకు సంబంధించి ఒకరు, పురుష అభ్యర్థి తప్పనిసరిగా ఉండాలన్నారు. ఓసీలకు సంబంధించి ఇద్దరు పురుషుల అభ్యర్థులు ఉండాలన్నారు. ఈ దరఖాస్తులను ఈ నెల 20వ తేదీలోపు కర్నూలు నగరంలోని మద్దూరు నగర్‌లో ఉన్న జిల్లా దేవదాయ శాఖ కార్యాలయంలో సమర్పించాలని ఆయన కోరారు.

రాజీవ్‌గాంధీ పార్కును అభివృద్ధి చేయండి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 5: నగరంలోని వెంకటరమణ కాలనీ రాజీవ్ గాంధీ పార్కును అభివృద్ధి చేయాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. సోమవారం పార్కు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు లక్ష్మీనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పార్కులో మట్టితో నిండుకుని అపరిశుభ్రంగా ఉండటంతో లోపలకి వచ్చేవారు కరువయ్యారని అన్నారు. పార్కులో ఉన్న దుమ్ము, ధూళి వల్ల స్థానికులు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని అన్నారు. పార్కును అన్ని విధాలుగా అందుబాటులోకి తీసుకు రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు శ్రీధర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పరిశ్రమకు భూములు ఇచ్చేది లేదు..


ఉయ్యాలవాడ గ్రామ సచివాలయం ఎదురుగా ధర్నా చేస్తున్న రైతులు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 5: సోలార్ పరిశ్రమ నిర్మాణానికి భూములు ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు మొర పెట్టుకున్నారు. సోమవారం మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో భారీ ఎత్తున రైతులు సచివాలయాన్ని ముట్టడించి ధర్నా చేపట్టారు. గ్రామంలో ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ, గ్రామ సభ జరపకుండా పంచాయతీ సెక్రటరీ శ్రీలత తీర్మానం ఎలా ఇస్తారని వాగ్వాదానికి దిగారు. తీర్మానాన్ని రద్దు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించుకున్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

సి. బెళగల్, ఫిబ్రవరి 5: రబీలో సాగు చేసిన పంటలకు రైతులు ఈ నెల 10వ తేదీ లోపు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి మల్లేష్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని బురాన్‌దొడ్డి, బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, బ్యాథోలి క్రిష్ణదొడ్డి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయన వెంట ఎంఈవోలు సిద్దు, వెంకటేశ్వర్లు, చెంచురాజు, మారెప్ప ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం ఇవ్వాలి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 5: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రూ.10 వేల వేతనం ఇవ్వాలని పథకం కార్మికులు యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీవాణి డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ పెంచకుండా ప్రతి సంవత్సరం తగ్గిస్తోందని అన్నారు. కార్మికులకు వేతనాలు సకాలంలో రాకపోవడంతో అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న గోరు ముద్ద పౌష్టికాహారన్ని అందించాలంటే ప్రతి విద్యార్థికి రూ.20 మెనూ చార్జి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తనిఖీల పేరుతో వేధింపులకు గురి చేయడం మానుకోవాలన్నారు. ప్రమాదానికి గురైన కార్మికుల కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరారు.. అనంతరం డీఆర్‌ఓ మధుసూదన్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమలో గౌరవ అధ్యక్షుడు నాగేశ్వరరావు, కోశాధికారి లీలావతి, లక్ష్మీదేవి, లచ్చమ్మ, అనసూయమ్మ, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

-యూనియన్ గౌరవ అధ్యక్షురాలు పి.నిర్మల


మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 5: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇస్తామని ఒప్పుకున్న వాటిని తక్షణమే అమలు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక కర్షక భవన్‌లో జిల్లా అధ్యక్షురాలు బి.రేణుకమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఎన్ని రకాలుగా ఇబ్బందులకు గురి చేసినా డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు 42 రోజులు సమ్మె చేశారని గుర్తు చేశారు. సమ్మెలో భాగంగా డిమాండ్లను పరిష్కరిస్తామని ఒప్పుకొని రోజులు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.వెంకటమ్మ, విజయభారతి, గోవర్ధనమ్మ, పద్మ, బాలదుర్గమ్మ పాల్గొన్నారు.

నియంతను సాగనంపుదాం

టీడీపీలో చేరిన 36వ వార్డు నాయకులు

కల్లూరు, ఫిబ్రవరి 5: రాష్ట్రంలో నియంత పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి అన్నారు. కల్లూరు అర్బన్ 36వ వార్డుకు చెందిన పలువురు గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరారు. సోమవారం పెద్దపాడు టీడీపీ సీనియర్ నాయకుడు రెడ్డిగారి చంద్రకళాధర్‌రెడ్డి, 36వ వార్డు ఇన్‌చార్జ్ ఆర్.తిరుమలేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గాలిరెడ్డి చక్రపాణిరెడ్డి, గాలిరెడ్డి లక్ష్మీరెడ్డి, గాలిరెడ్డి పరిధిరెడ్డి గౌరు దంపతుల సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పాణ్యం నియోజకవర్గంలో గౌరుచరిత గెలుపే ధ్యేయంగా కష్టపడి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, మండల కన్వీనర్ డి.రామాంజనేయులు, మాజీ ఎంపిపి బాల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **వైసీపీకి షాక్ :** కల్లూరు అర్బన్ 36వ వార్డు పెద్దపాడుకు చెందిన నగర డిప్యూటీ మేయర్ ముఖ్య అనుచరుడు మల్లికార్జున ఆదివారం గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరారు. వైసీపీ విధానాలు నచ్చక టీడీపీలో చురినట్లు మల్లికార్జున స్పష్టం చేశారు.


టీడీపీలో చేరిన నాయకులు

● **గౌరు చేతుల మీదుగా క్యాలండర్ ఆవిష్కరణ:** కర్నూలు జిల్లా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ క్యాలండర్, డైరీని పాణ్యం, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్‌లు గౌరుచరిత, గౌరు వెంకటరెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ విడుదల చేశారు. సోమవారం గౌరు స్వగృహంలో అసోసియేషన్ అధ్యక్షుడు టి.కృష్ణ, సెక్రటరీ రామకృష్ణగౌడ్, ఉపాధ్యక్షుడు సురేష్‌గౌడ్, సహాయ కార్యదర్శి నాయక్, నాగరాజు, శ్రీనివాసులు, నరసింహం, భరత్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు మంచి భవిష్యత్ ఇస్తా

● యువకులతో కర్నూలు టీడీపీ ఇన్‌చార్జి భరత్ ముఖాముఖి

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 5: యువతకు మంచి భవిష్యత్ ఇచ్చేందుకు పని చేస్తానని కర్నూలు టీడీపీ ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. సోమవారం కర్నూలు నగరంలోని సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలతో పాటు బిర్లా కాంపౌండ్‌లోని విజేత స్టడీ సర్కిల్ సెంటర్‌లో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో తగిన నిర్ణయాలు తీసుకుంటే భవిష్యత్ బాగుంటుందని అన్నారు. కర్నూలులో పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగాలు కల్పించే బాధ్యత తాను తీసుకుంటానని యువతకు టీజీ భరత్ హామీ ఇచ్చారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ డబ్బుల కోసం రాజకీయాల్లోకి రాలేదని, ప్రజా సేవ కోసమే వచ్చారని అన్నారు. కర్నూల్లో తాను గెలిస్తే జిల్లా మొత్తం బాగుపడేలా చూసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత సోమిశెట్టి నవీన్, జనసేన ఇన్‌చార్జి ఆర్షద్, పవన్, రబ్బాని, అనిత, శ్రీనివాసరెడ్డి, కాపు సంక్షేమ సేన జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, విజయ్, మోహన్ పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న టీజీ

పదో తరగతి మోడల్ టెస్టు


మోడల్ ప్రశ్నపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 5: పదో తరగతి విద్యార్థుల మోడల్ పరీక్ష ప్రశ్నపత్రాన్ని యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌పాటిల్, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్ మాట్లాడారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ మోడల్ టెస్టు చాలా ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థులు ముందుగానే ఇలాంటి పరీక్షలు రాయడం వలన వారిలో ఉన్న భయం పోతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అబ్బు, ఆర్యన్, మల్లేష్, యోగి, అమీర్, ఆదిత్య, గిరి పాల్గొన్నారు.

వాణిజ్య పన్ను శాఖలో పోస్టుల భర్తీకి పరీక్షలు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 5: వాణిజ్య పన్నుల శాఖలో కాంట్రాక్టు పద్ధతి డేటా ఎంట్రీ ఆపరేటర్-7, నాల్గవ తరగతి ఉద్యోగాలు-12 పోస్టుల భర్తీ కోసం పరీక్షలు నిర్వహించారు. కలెక్టర్ డా.జి.సృజన ఆదేశాల మేరకు సోమవారం గుత్తిపెట్రోలు బంకు సమీపాన వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయంలో నిర్వహించిన పరీక్షలకు అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు కోసం 150 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 33 మందిని, అదే విధంగా నాల్గవ తరగతి ఉద్యోగం కోసం 160 మంది దరఖాస్తు చేసుకోగా 60 మందిని ఎంపిక చేసి పరీక్ష నిర్వహించారు. ఇందులో ఉత్తీర్ణులైన వారికి కలెక్టర్ డా.జి.సృజన్ ఉద్యోగం ఇవ్వనున్నట్లు తెలిసింది.

ఆర్డీవోగా శేషిరెడ్డి బాధ్యతల స్వీకరణ



కర్నూలు(రూరల్), ఫిబ్రవరి 5: కర్నూలు రెవెన్యూ డివిజనల్ అధికారిగా ఎం.శేషిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సి.హరిప్రసాద్ చిత్తూరు జిల్లా మదనపల్లె ఆర్డీవోగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నరసరావుపేట ఆర్డీవోగా పని చేస్తున్న శేషిరెడ్డిని కర్నూలుకు వచ్చారు. కార్యాలయ పరిపాలన అధికారి వేణుగోపాల్ సిబ్బంది నూతన ఆర్డీవోకు పూలబొకే ఇచ్చి మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కలిసి కట్టుగా పని చేసి ఎన్నికలను విజయవంతం చేద్దామని ఆయన కార్యాలయ సిబ్బందిని కోరారు.

● కర్నూలు రూరల్ మండల తహసీల్దార్‌గా బి.రామాంజులనాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న శివరాముడిని అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరుకు బదిలీ చేశారు.

పాఠశాలలకు చెస్ బోర్డులు పంపిణీ

కోడుమూరు (రూరల్), ఫిబ్రవరి 5: మండలంలోని లద్దగిరి, గోరంట్ల, అమడగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు టీడీపీ సీనియర్ నాయకుడు పట్టి క్రిష్ణ చదరంగం బోర్డులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నేత, నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు దివంగత ఎంపీపీ రాజవర్ధన్‌రెడ్డి జ్ఞాపకార్థం పంపిణీ చేసినట్లు తెలిపారు. రాజవర్ధన్‌రెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. ఆలోచనా శక్తిని పెంపొందించడానికి చదరంగం ఆట ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 5: రాయలసీమ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలలో 2017 సంవత్సరంలో చదివి ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించాలని యూనివర్సిటీ అధికారులను ఏఐఎస్ఎఫ్ నాయకుడు సోమన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలో 2017 సంవత్సరంలో 1, 2, 3 సబ్జెక్టులలో అత్యధిక మంది విద్యార్థులు ఫెయిలయ్యారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఫెయిలైన విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల పరీక్షలు నిర్వహించాలని, లేకపోతే విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. సమావేశం అనంతరం వర్సిటీ ఉపకులపతి డా.సుధీర్ ప్రేమ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

నేడు చెన్నమ్మ సర్కిల్లో 'జయహో బీసీ'

కల్లూరు, ఫిబ్రవరి 5: తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాతకంగా నిర్వహిస్తోన్న జయహో బీసీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు చెన్నమ్మసర్కిల్లో నిర్వహించనున్న కార్యక్రమానికి కల్లూరు అర్బన్ 16వార్డుల నుంచి టీడీపీ నాయకులు కార్యకర్తలు కదలిరావాలన్నారు. ఈమేరకు చెన్నమ్మసర్కిల్లోని సభాప్రాంగణాన్ని టీడీపీ కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, మైనారిటీ నాయకులు ఎస్.ఫిరోజ్, కాసాని మహేష్‌గౌడ్, పవన్‌కుమార్, కల్లూరు మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు రామకృష్ణ పరిశీలించారు. తెలుగుదేశం పార్టీ బీసీ సంఘాల రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ నాయకులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

జగనన్నను సాగనంపుదాం చంద్రన్నను గెలిపించుకుందాం


టీడీపీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరిస్తున్న నాయకులు

కర్నూలు(రూరల్) ఫిబ్రవరి 5: వచ్చే ఎన్నికల్లో జగనన్నను సాగనంపుదాం, చంద్రన్నను గెలిపించుకుందామని కోడమూరు నియోజకవర్గ టీడీపీ యువనాయకులు బొగ్గుల దస్తగిరి ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం కర్నూలు రూరల్ మండలం రేమట గ్రామంలో టీడీపీ మేనిఫెస్టోపై ఇంటింటా తిరిగి ప్రజలకు వివరించారు. దస్తగిరి మాట్లాడుతూ కోడుమూరు నియోజకవర్గంలో వలసలను నివారించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యమైపోయాయని, ఏపీలో పరిశ్రమలను పెట్టడానికి కూడా పెట్టుబడిదారులు భయపడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ భారీ మెజార్టీతో గెలుపొంది, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కురవ పెద్ద వెంకన్న, రాఘవరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లను పరిశీలించిన జేసీ


జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ వివరాలు తెలుసుకుంటున్న జేసీ

కల్లూరు, ఫిబ్రవరి 5: లబ్ధిదారులకు స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. సోమవారం కల్లూరు అర్బన్ పరిధిలోని అబ్బాస్‌నగర్ 69, 72వ సచివాలయాలను సందర్శించి జేసీ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. జగనన్న ఇళ్ళస్థలాల రిజిస్ట్రేషన్ ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈమేరకు లబ్ధిదారుల వివరాలు మ్యాపింగ్ కాకపోవడం, సాంకేతిక కారణాలు తలెత్తడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొంత నెమ్మదిగా సాగుతుందని జిల్లా రిజిస్ట్రార్ సిహెచ్. నాగలింగేశ్వరరావు జేసికి వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు పేదలకు చెందిన ఇళ్ళస్థలాల రిజిస్ట్రేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ రిజిస్ట్రేషన్ అధికారులు, మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కల్లూరు సబ్ రిజిస్ట్రార్ హాజీమియ్య, తహసీల్దారు సి. మునివేలు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌గా సంతోష్ బాధ్యతలు


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

గూడూరు, ఫిబ్రవరి 5: గూడూరు తహసీల్దార్‌గా ఉదయ్ సంతోష్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం గూడూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ ఉదయ్ సంతోష్‌కు మండల తహసీల్దార్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 334 గృహాలు ఉండగా ఇప్పటి వరకు 101 గృహాలను రిజిష్టర్ చేశామని, ఇంకా 233 గృహాలను ఇంకా రిజిష్టర్ చేయాల్సి ఉందని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

ఓర్వకల్లులో నటరాజ్...



ఓర్వకల్లు, ఫిబ్రవరి 5: మండల తహసీల్దారుగా నటరాజ్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ శివనాగప్రసాద్ రెడ్డి అనంతపురం వెళ్లారు. అనంతపురం జిల్లా కదిరి తహసీల్దారుగా పని చేస్తున్న నటరాజ్ ఓర్వకల్లు తహసీల్దారుగా బదిలీపై వచ్చారు. నూతన తహసీల్దారు నటరాజ్‌కు డిప్యూటీ తహసీల్దార్ సతీష్, వీఆర్వోలు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సి.బెళగల్ ఎస్ఐగా తిమ్మారెడ్డి

సి. బెళగల్, ఫిబ్రవరి 5: సి.బెళగల్ ఎస్ఐ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్ఐ తిమ్మారెడ్డి మాట్లాడుతూ మండలంలోని ప్రజలు రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మండల ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు.

రైతులకు కరువు నిధులు మంజూరు చేయాలి

● రాస్తారోకో చేపట్టిన సీపీఐ


రాస్తారోకోలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు కృష్ణ

కోడుమూరు, ఫిబ్రవరి 5: రైతులకు కరువు నిధులను మంజూరు చేసి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పాతబస్టాండ్‌లో సోమవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. వర్షాభావ పరిస్థితుల వలన గతేడాది రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో చాలా మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఇంత వరకు రైతులకు కరువు నిధులను ఇవ్వక పోవడం చాలా దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులను విడుదల చేసి రైతులను ఆదుకోవాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి శేషకుమార్ సీపీఐ సీనియర్ నాయకులు మునుస్వామి, తిమ్మప్ప, శివుడు, చిన్నరాముడు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: పంటనష్ట పరిహారం రైతు ఖాతాల్లో జమ చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఎన్.రసూల్ డిమాండ్ చేశారు. సోమవారం కల్లూరు తహసీల్దారు కార్యాలయం ముందు సీపీఐ నగర సహాయ కార్యదర్శి దంబోళం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఎస్ఎన్.రసూల్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో కరువు కరువు సహాయక చర్యలు చేపట్టాలన్నారు. శ్రీరాములుగౌడ్, ఖాజా, ముని, బీసన్న, బాబయ్య పాల్గొన్నారు.

ఎస్ఐగా బాల నరసింహులు

కోడుమూరు, ఫిబ్రవరి 5: కోడుమూరు ఎస్ఐగా బాల నరసింహులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జిల్లాలో జరిగిన బదిలీలో భాగంగా కర్నూలు తాలుకా స్టేషన్‌లో పని చేస్తున్న ఆయన బదిలీపై కోడుమూరుకు వచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే సహించేది లేదన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు.

అసంతృప్తి కేసులు ఉండకూడదు

● కమిషనర్ ఎ.భార్గవతేజ


స్పందనలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ భార్గవతేజ

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 5: జగనన్నకు చెబుదాం-స్పందన అర్జీల పరిష్కారంలో అసంతృప్తి కేసులు ఉండకూడదని నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవతేజ అన్నారు. సోమవారం కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులు మళ్లి వస్తున్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారులను సచివాలయాలకు పిలిపించుకుని పరిష్కారానికి సంబంధించిన ఎండార్స్‌మెంట్ వారి చేతికి ఇచ్చినట్లు రశీదును పొందాలని అన్నారు. అయితే కొందరు వాటిని పాటించడం లేదని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్మీపురం, మయూరి గ్రీన్ లాండ్స్ శ్రీ రామ రెసిడెన్సీ త్రాగు నీటి సరఫరా, పారిశుధ్యం, రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, మురహరి నగర్‌లో రోడ్లు, డ్రైనేజీ నిర్మించాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కమిషనర్‌కు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శశికళ, మేనేజర్ చిన్నరాముడు తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక 46వ వార్డు అశోక్‌నగర్‌లోని పార్కును అభివృద్ధి చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. స్పందనలో కమిషనర్ ఎ.భార్గతేజకు వినతి పత్రం అందతజేశారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ 1986లో తాను కౌన్సిలర్‌గా పదవీ కాలం పూర్తయ్యే నాటికే పార్కును అన్ని విధాలుగా పూర్తి చేశామన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల పార్కు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని తక్షణమే పార్కును అభివృద్ధి చేసి అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

భక్తులకు ఇబ్బందులు కలగనీయం

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 5: శ్రీశైలంలోని బీరప్పస్వామి సదనం దాతలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగనీయమని అఖిల భారత పూర్వ వంశ నిత్యాన్నదానం సత్రం అధ్యక్షులు ఎంకే రంగస్వామి, సభ్యులు గుడిసె శివన్న, దేవేంద్ర అన్నారు. సోమవారం కర్నూలు కురువ సంఘం కార్యాలయంలో వారు మాట్లాడుతూ నిత్యాన్నదాన సత్రం విషయంలో హైదరాబాదు ప్రాంతానికి చెందిన కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. అలాంటి వారి మాటలు నమ్మవద్దని తెలిపారు. దాతలను ఎలా గౌరవించాలో అందరికీ తెలుసునన్నారు. సమావేశంలో వెంకటేశ్వర్లు, కురువ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో పర్యటించిన ఆర్డీవో

గూడూరు, ఫిబ్రవరి 5: కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి గూడూరులో పర్యటించారు. సోమవారం గూడూరులో పర్యటించిన ఆర్డీవో గూడూరులోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలు, వీఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన పనులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాలు, ఆలాగే నవరత్నాలు పేదలందరికీ ఇల్లు రిజిస్ట్రేషన్లు, రీ సర్వే పనులు, రెవెన్యూ సంబంధించిన పనుల నిర్వాహణపై సమీక్ష నిర్వహించామన్నారు.

పంటలు పరిశీలించిన వ్యవసాయాధికారి

కోడుమూరు (రూరల్), ఫిబ్రవరి 5: మండలంలోని వివిధ గ్రామాల్లో పంటలను వ్యవసాయాధికారి రవిప్రకాష్ సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా ముడుమలగుర్తి, ప్యాలకుర్తి, వర్కూరు గ్రామాలలో ఆర్బీకేలను తనిఖీ చేసి ఈకేవైసీ వివరాలపై ఆరా తీశారు. రబీ పంటలకు సంబంధించి ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎరువులు, పురుగుమందుల అమ్మకాల పెండింగ్ బకాయిలు త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం వ్యవసాయాధికారి జాబితాలో నమోదైన పంటలు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది ప్రదీప్‌కుమార్‌రెడ్డి, అనూష, సుకన్య మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరించిన కల్లూరు తహసీల్దారు



కల్లూరు, ఫిబ్రవరి 5: కల్లూరు మండల తహసీల్దారుగా సి.మునివేలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా తాడిపత్రి మండల తహసీల్దారుగా విధులు నిర్వహిస్తూ సాధారణ ఎన్నికల విధుల్లో భాగంగా కర్నూలు జిల్లాకు బదిలీపై వచ్చారు. జిల్లా కలెక్టర్ డా.జి.సృజన కల్లూరు తహసీల్దారుగా సి.మునివేలును నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం విధుల్లో చేరారు.

బాధ్యతాయుతంగా పని చేయాలి

గూడూరు, ఫిబ్రవరి 5: నగర పంచాయతీ అధికార యంత్రాగం బాధ్యతయుతంగా పని చేసి నగర అభివృద్ధికి తోడ్పడాలని నూతన నగర కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన దివాకర్ రెడ్డి అన్నారు. సోమవారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో నూతన కమిషనర్‌గా వి దివాకర్ రెడ్డి బాధ్యతలను స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్యంపై దృష్టి సారించాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. అలాగే పన్నుల వసూలు సక్రమంగా చేయాలన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

హాలహర్వి, ఫిబ్రవరి 5: మండలంలోని నగరూరు గ్రామంలో ఉరుసు సందర్భంగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను జడ్పీటీసీ దొరబాబు సోమవారం ప్రారంభించారు. పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లకు మొదటి బహుమతిగా రూ.25వేలు, రెండో బహుమతి రూ.15వేలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో విజయ్ గోపాల్ రెడ్డి, కేశవ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, విశ్వనాథ్, మల్లేష్, గోపి, రవి పాల్గొన్నారు.

శ్రీశైలంలో మహా కుంభాభిషేకం జరపండి

ఆదోని టౌన్, ఫిబ్రవరి 5: శ్రీశైలంలో మల్లన్న భక్తుల కోసం మహా కుంభాభిషేకం జరిపించాలని జంగమ వీరశైవ హక్కుల పోరాట సమితి నాయకులు ఎడవల్లి మంజునాథ్, జేపీ మల్లికార్జున, ఎండీ బద్రినాథ్ స్వామి కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ పన్నెండు సంవత్సరాలకు ఒకసారి జరిపే మహా కుంభాభిషేకం కోసం భక్తులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో శివరాజ్, దానాపురం సర్పంచ్ మల్లికార్జున, కన్నే జగదీష్, కౌతాళం అమరయ్య స్వామి పాల్గొన్నారు.

పని చేయని సర్వర్లు

హొళగుంద, ఫిబ్రవరి 5: స్థానిక ఎంపీడీవో, పంచాయతీ కార్యాలయం వద్ద జగనన్న కాలనీలోని పేదల స్థలాలకు రిజిస్ట్రేషన్ సేవలు వారం రోజుల క్రితం ప్రారంభించారు. అయితే సర్వర్ సమస్య ఉండటంతో లబ్ధిదారులు రోజుల తరబడి కార్యాలయం వద్ద పడిగాపులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌ను వివరణ కోరగా రోజుకు కొన్ని రిజిస్ట్రేషన్లు అవుతున్నాయని, సర్వర్ ప్రాబ్లం ఉన్నట్లు తెలిపారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

ఆస్పరి, ఫిబ్రవరి 5: మండలంలోని హాలీగేర గ్రామంలో కిరాణాషాపులో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జనసేన పార్టీ నాయకులు అరవిందు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. సుమారు రూ.ఆరు లక్షల మేరకు నష్టం వాటిల్లిందని, నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో శివ, రంజిత్, హనుమేష్, వీరేష్, శ్రీకాంత్, సాయి పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలి

ఆదోని టౌన్, ఫిబ్రవరి 5: ఆదోని రైల్వే స్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ ఆసుపత్రుల సలహా సంఘం సభ్యుడు నసీరుద్దీన్ పటేల్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా మాత్రమే ఉన్నాయని, అవి పని చేయకపోవడంతో, పోలీసులకు తప్పిపోయిన వారి గురించి, ఇతర ప్రాంతాలకు పారిపోయిన దొంగల గురించి తెలుసుకొనే అవకాశం లేకుండా పోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాట్ ఫారాలపై వికలాంగుల కోసం ఏర్పాటు చేసిన శౌచాలయాలకు తాళం వేయడంతో వికాలాంగులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉందని, వెంటనే వాటిని వినియోగంలోకి తీసుకరావాలన్నారు. అనంతరం రైల్వే స్టేషన్ మేనేజర్ వెంకటేశులకు వినతిపత్రం ఇచ్చారు.

నీటి సమస్య తలెత్తకుండా చూస్తాం

మద్దికెర, జనవరి 5: వేసవిలో గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఖాన్, జడ్పీటీసీ డి.మురళీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మద్దికెర, బొజ్జనాయునిపేట, బురుజుల గ్రామాల్లో జల్‌జీవన్ కింద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మద్దికెరలోని సాయినగర్, రామ్‌నగర్, బొజ్జనాయునిపేట, బురుజుల గ్రామాల్లో జల్‌జీవన్ కింద ఇంటింటికి కొళాయి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మద్దికెర టౌన్‌లో డిపాజిట్ లేకుండా పంచాయతీ వారు ఉచితంగా కొళాయి కనెక్షన్లు ఇస్తున్నారని, అయితే.. జల్‌జీవన్‌కు సంబంధం లేదని వివరించారు. నీటి సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్, పంచాయితీ సలహాదారులు బండారు ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసు యాదవ్, మైనార్టీ నాయకులు ఆకుల ఖాజావలి ఉన్నారు.

రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

మద్దికెర, జనవరి 5: మద్దికెర గ్రామంలోని గ్రామ దేవత మద్దమ్మ జాతరను పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డి.శ్రీనివాస్ యాదవ్, కవిరెడ్డి రామాంజులు, కవిరెడ్డి గోపాల్, ఆకుల ఖాజావలి తెలిపారు. సోమవారం మాట్లాడుతూ మద్దికెర గ్రామ దేవత మద్దమ్మ జాతర ఈ నెల 24, 25 తేదీల్లో జరుగుతుందని తెలిపారు. 25న స్థానిక పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న స్థలంలో రాష్ట్ర స్థాయి రాతిదూలం పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు సమావేశంలో నిర్వహకులు రాముడు, శ్రీనివాసులు, కవిరెడ్డి కృష్ణ ఉన్నారు.

వైసీపీని ఇంటికి సాగనంపాలి

దేవనకొండ ,ఫిబ్రవరి 5: రాష్ట్రంలో వైసీపీని ఇంటికి సాగనంపాలని మండల కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్, శిక్షణ నిర్వాహకుడు వంశీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణలో భాగంగా క్లస్టర్, యూనిట్ ,బూత్ స్థాయి ఇన్‌చార్జిలకు ఓటరు జాబితాపై అవగాహన కల్పించారు. చంద్రబాబు ఆరు గ్యారెంటీలు, పార్టీ గెలుపు కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

ముగిసిన వేలాలు

దేవనకొండ , ఫిబ్రవరి 5 : కప్పట్రాళ్ల రిజర్వు పరిధిలోని కొలుట్ల చెన్నకేశవస్వామి దేవస్థానంలో టెంకాయ, తలనీలాల వేలాలు ముగిశాయి. తలనీలాలు రూ. 2.75 లక్షలు కప్పట్రాళ్లకి చెందిన యం. రామకృష్ణ, టెంకాయలు రూ.1.62 లక్షలు అలువాల గ్రామానికి చెందిన నర్సన్న వేలం పాటలో దక్కించుకున్నారు. మూడు నెలల హుండీ ఆదాయం రూ.39,675 వచ్చినట్లు ఈఓ చంద్రశేకర్ రెడ్డి తెలిపారు.

క్రికెట్ క్రీడా పోటీలు ప్రారంభం

మంత్రాలయం, ఫిబ్రవరి 5: మంత్రాలయం మండలంలోని కాగ్గల్ గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి క్రికెట్ క్రీడ పోటీలను మంచాల సింగిల్ విండో అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి ప్రారంభించారు. సోమవారం భీమ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడలను ప్రారంభించారు. రాంపురం రెడ్డి సోదరుల సహకారంతో మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాఘవరెడ్డి, సురేంద్ర, చంద్ర,హనుమంతు, వెంకటేష్, చిన్న హుసేన్, అయ్యప్ప, రాముడు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ


మహిళలకు చెక్కు అందజేస్తున్న నాయకులు

చిప్పగిరి, ఫిబ్రవరి 5: మండలంలోని 464 పొదుపు గ్రూపులకు సంబంధించిన 4,571 మంది సభ్యులకు రూ.3కోట్ల వైయస్సార్ ఆసరా నాల్గవ విడత మెగా చెక్కును సోమవారం స్త్రీశక్తి భవనంలో ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ, ఎంపీపీ జూటూరు హేమలత, మండల కన్వీనర్ జూటూరు మారయ్య లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో స్త్రీనిధి జిల్లా డైరెక్టర్ విజయలక్ష్మి, ఏసీ నవీన్, ఏపీఎం నాగార్జున పాల్గొన్నారు.

ఇంటికి నిప్పు

మంత్రాలయం, ఫిబ్రవరి 5: మండలంలోని చెట్నహళ్ళి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు తెలుగు పరుశప్ప ఇంటిని గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం తెల్లవారుజామున దగ్ధం చేశారు. పరుశప్ప భార్య జయమ్మ, ఇద్దరు కూతుళ్లు, కొడుకుతో ఇంటిలో నిద్రిస్తుండగా ఇంటిపై డీజిల్ చల్లి నిప్పు అంటించారు. దీంతో ఇల్లంతా మంటలు వ్యాపించడంతో పరుశప్ప కుటుంబ సభ్యులతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈనెల 21న తన మూడో కూతురు సరోజ వివాహానికి సిద్ధం అవుతుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. దాదాపు రూ2 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. మంత్రాలయం ఎస్ఐ వేణుగోపాలరాజు సంఘటన స్థలానికి చేరుకుని నిప్పుపెట్టిన వారికోసం సీసీ కెమెరాల ద్వారా గాలింపు చేపడతామని ఎస్ఐ తెలిపారు.

పంట నష్ట పరిహారం ఇవ్వరా..?

● సీపీఐ ఆధ్వర్యంలో ధర్నాలు


పత్తికొండలో ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు


ఆస్పరిలో రాస్తారోకో చేస్తున్ననాయకులు, రైతులు



ఎమ్మిగనూరులో ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు


మద్దికెరలో..

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 5: కరువు మండలాలుగా ప్రకటించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కరువు, పంట నష్టపరిహారం రైతులకు ఎప్పుడు ఇస్తారో చెప్పాలని సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్ డిమాండ్ చేశారు. సోమవారం కరువు సహాయక చర్యలు చేపట్టి పంట నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక సీఆర్ భవన్ నుంచి ఆ పార్టీ శ్రేణులు పట్టణ వీధుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు స్తంభాల కూడలిలో ధర్నా నిర్వహించి, అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో కరువు బారిన పడిన రైతాంగాన్ని ఆదుకునేందుకు కరువు సహాయక చర్యలు చేపట్టి పంట నష్ట పరిహారాన్ని రైతుల ఖాతాల్లోకి జమ చేయాలన్నారు. ప్రధాన వాణిజ్య పంటలకు రూ.40వేల నుంచి రూ.లక్ష దాకా నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ ప్రజా సంఘాల నాయకులు గురుదాసు, రామాంజనేయులు, సురేంద్ర కుమార్, ఈరన్న, నెట్టికంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం మండల కేంద్ర ఆస్పరిలో సీపీఐ నాయకులు, రైతులు రాస్తారోకో నిర్వహించారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడు నాగేంద్రయ్య, మండల కార్యదర్శి విరుపాక్షి మాట్లాడుతూ జిల్లాలో 24 మండలాల్లో కరువు నెలకొందని, ఆస్పరి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినా, ఇంతవరకు నివారణ చర్యలు చేపట్టలేదని ధ్వజమెత్తారు. వేసవి రాకముందే గ్రామాల్లో తీవ్ర తాగునీటి సమస్య నెలకొందని, యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాజశేఖర్, కృష్ణమూర్తి, రంగన్న, ఉరుకుందప్ప, బ్రహ్మయ్య, కృష్ణ, హనుమంతు, గోపాల్ పాల్గొన్నారు.

మద్దికెర: మండలంలో వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారనీ ప్రతి రైతుకు ఎకరాకు రూ.40వేల చొప్పున వారి ఖాతాలో జమ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నబీ రసూల్ డిమాండ్ చేశారు. సోమవారం మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో ప్రధాన బస్టాండు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కారన్న, మదనంతపురం హనుమన్న, కోదండరాముడు, నెట్టికంటయ్య, రంగస్వామి, బొజ్జన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించి రైతులకు నష్టపరిహారం ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడు, పట్టణ కార్యదర్శి రంగన్న అన్నారు. సోమవారం సోమప్ప సర్కిల్‌లో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ముందు ఉరితాళ్లు వేసుకొని వినూత్నంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం రైతులకు పరిహారం చెల్లించాలని డిప్యూటీ తహసీల్దార్ గురురాజారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మగురుడు, సమీఉల్లా, కేసీ జబ్బార్, దాదావలి, విజయేంద్ర, మల్లికార్జునగౌడు, ఇస్మాయిల్, ఖాజా, వీరేష్, సుంకన్న, మునిస్వామి, రామలింగడు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజినేయులు డిమాండ్ చేశారు. సోమవారంపెద్దకడబూరులోని తహసీల్దార్ కార్యలయం ముందు సీపీఐ నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ వీరేంద్రగౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దస్తగిరి,నాయకులు నాగరాజు, తిక్కన్న, హనుమంతు, బసవరాజు పాల్గొన్నారు.

వెల్దుర్తి: కరువు సహాయక చర్యలు చేపట్టాలని పట్టణంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం సీపీఐ నాయకులు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ, చిలిపికృష్ణ, గిరి, వెంకటేశ్వర్లు, రాజు, రామాంజనేయులు, అనిల్, చిన్నమాదులు, రాముడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు: పంటలు నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం వెంటనే పంట నష్టపరిహారం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రామంజి, రైతు సంఘం మండల అధ్యక్షులు వీ చంద్రకాంత్ రెడ్డి, నాగరాజు, సిద్దలింగ పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి : బీవీ


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

గోనెగండ్ల, ఫిబ్రవరి 5: బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. సోమవారం పెద్దమరివీడు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ కూడలిలో ఎన్టీఆర్, బీవీ మోహన్‌రెడ్డి చిత్రపటాలు పెట్టి పార్టీ జెండాను ఎగుర వేశారు. గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాత్రి పెద్దమరివీడు లో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. రాత్రి అక్కడే బస చేశారు. బీవీ మాట్లాడుతూ బీవీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాత్రం సీఎం జగన్‌కు, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు భాగా గుర్తుకు వస్తారని, ఎన్నికలు అయిపోయిన తరువాత వారిని పలకరించే దిక్కు ఉండదని ఆయన మండిపడ్డారు. టీడీపీ పాలనలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. గ్రామాల్లో రాత్రి అంధకారం రాజ్యమేలుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్, తిరుపతయ్యనాయుడు, రమేష్‌నాయుడు, రంగస్వామినాయుడు, రాంపురం రఫీక్, నూరహమ్మద్, బారతం రహంతుల్లా, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, పెద్దమరివీడు అబ్దుల్లా, రామాంజినేయులు, బడేసా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో టీడీపీ సర్పంచులు


ఆలూరు పోలీసుల అదుపులో ఉన్న సర్పంచులు

ఆలూరు, ఫిబ్రవరి 5: అసెంబ్లీ ముట్టడి నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా ఆలూరు నియోజకవర్గంలోని టీడీపీ మద్దతు సర్పంచులను ఆలూరు పోలీసులు సోమవారం రాత్రి అదుపులో తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచులు మరకట్టు ఎల్లప్ప, మోహన్ రాజ్, నాగరాజు, రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామ పంచాయితీలను జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి సర్పంచుల అధికారాలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ప్రజలు జగన్ ప్రభుత్వాన్ని సాగనంపుతారన్నారు.

స్పందన అర్జీలను త్వరగా పరిష్కరించండి : సబ్ కలెక్టర్

ఆదోని, ఫిబ్రవరి 5: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ సూచించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనకు వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.

● ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన హనుమంతు సర్వే నంబర్ 9/ఏలో 2.22 ఎకరాల భూమి, సర్వే నెంబర్ 85/ఏలో 1.37 ఎకరాల భూమి తమ పెద్దల నుంచి సంక్రమించిందని, దాన్ని ఆక్రమించారని అర్జీ సమర్పించుకున్నారు.

●ఆదోని పట్టణం కల్లుబావి పంచాయతీకి చెందిన సురేష్... సర్వే నెంబర్ 262/ఎఫ్‌లో 1.46 ఎకరాల భూమి తనకు ఉన్నద ని, ఆన్‌లైన్‌లో 0.95 మాత్రమే ఉన్నదని, మిగిలిన భూమి వేరే వారిపై నమోదు అయిందని, మిగతాది కూడా ఆన్‌లైన్‌లో తన పేర నమోదు చేయాలని అర్జీ సమర్పించుకున్నారు.

● ఆదోని మండలం బైచిగేరి గ్రామానికి చెందిన శేకమ్మ... సర్వే నెంబర్ 167/సీలో 1.22 ఎకరాల భూమి ఉందని, ఆ భూమిలో 8 సంవత్సరాల క్రితం ఎకరా భూమి విక్రయించామని, మిగిలిన 22 సెంట్ల భూమికి ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని అర్జీ సమర్పించుకున్నారు.

● గత 40 సంవత్సరాలుగా ఆదోని పట్టణం కల్లుబావిలో నివాసం ఉంటున్నామని, తమకు పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని ఆదోని పట్టణం కల్లుబావికి చెందిన బాలరాజు అర్జీ అందజేశారు.

ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో శ్రీనివాసులు, డీఈ రవికుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, ఆర్డీవో నాగేంద్ర, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ చేతన్ ప్రియ, కౌసార్ భాను, వలిబాషా పాల్గొన్నారు.

జాతీయ క్రీడా పోటీల్లో ప్రతిభ

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 5: మండలంలోని పెద్దహరివాణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో ప్రతిభ చాటారు. సోమవారం ప్రతభ చాటిన క్రీడాకారులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు ఇందిరాదేవి మాట్లాడుతూ జనవరి 24 నుంచి జర్ఖండ్‌లో జరిగిన జాతీయస్థాయి అండర్-14 కబడ్డీ పోటీల్లో తమ విద్యార్థి అనుమేష్ రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి ప్రతిభ చాటారన్నారు. 9వ తరగతి విద్యార్థి ప్రహర్ష చెస్ పోటీల్లో ఈనెల 4న కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. క్రీడాకారులతో పాటు శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ రామన్నను అభినందించారు.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 5: ఆదోని పట్టణంలో ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటున్న కార్పొరేట్ విద్యాసంస్థల పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, నరేష్, వీరేష్, ప్రేమ్, సునీల్, రవి పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న పీఠాధిపతి

మంత్రాలయం, ఫిబ్రవరి 5: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి ధార్మిక పర్యటనలో భాగంగా సోమవారం తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అదే విధంగా ధార్మిక సదస్సులో టీటీడీ ఏర్పాటు చేసిన పీఠాధిపతి సదస్సుల్లో పాల్గొని ఆధ్యాత్మిక విషయాలపై చర్చించారు. మంత్రాలయం రాఘవేంద్రస్వామి యొక్క విశిష్టత, అభివృద్ధి, భక్తుల సౌకర్యాలు వంటి అంశాలపై చర్చించి భారత దేశ సాంస్కృతి సంప్రదాయాలను విస్తరింపజేయాలని పీఠాధిపతి అన్నారు.

ప్రహ్లాదరాయల రజిత రథోత్సవం

మంత్రాలయం, ఫిబ్రవరి 5: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజిత రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. సోమవారం మాఘమాసం దశమిని పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊంజల మంటపంలో ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలను అధిష్టించి ఊంజలసేవ నిర్వహించారు.

పాత పెన్షన్ అమలు చేసే వారికే మద్దతు

నందవరం, ఫిబ్రవరి 5: పాత పెన్షన్ అమలు చేసే వారికే ఉద్యోగ, ఉపాధ్యాయల మద్దతు ఉంటుందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి దేవపాల్ అన్నారు సోమవారం మండలంలోని సోమలగూడురు, ముగతి, మిట్టాసోమాపురం, రాయచోటి గ్రామాల్లో ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఇచ్చిన హామీలను జగన్ విస్మరించారన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, వెంకట్రాముడు, దుబ్బన్న, రాజశేఖర్, శంకర్, వెంకటేష్, గురు, విజయ్, ఇసాక్ పాల్గొన్నారు.

చర్యలు తప్పవు

ఆస్పరి, ఫిబ్రవరి 5: రానున్న సార్వత్రిక ఎన్నికలలో రౌడీయిజం, గూండాయిజానికి పాల్పడితే ఎటువంటి వారైనా కేసులు నమోదు చేస్తామని ఆస్పరి సీఐ హనుమంతప్ప హెచ్చరించారు. సోమవారం మండంలంలోని 33 గ్రామాల పరిధిలో దౌర్జన్య కాండకు, హింసకు పాల్పడే రౌడీషీటర్లను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల నిర్వాహణ కోసం వారు కృషి చేయాలని, లేదంటే ఆయా సెక్షన్ల ప్రకారం కేసులు బుక్ చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

వైసీపీని గద్దె దించడమే లక్ష్యం

పత్తికొండ, ఫిబ్రవరి 5 : రాష్ట్రంలో పేదల సంక్షేమం మరిచిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి పార్థసారథి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కనిగిరి నీలకంఠ అన్నారు. సోమవారం పత్తికొండలో పత్తికొండ, ఆలూరు అసెంబ్లీల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మట్లాడుతూ ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో 188 హామీలను ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ అందులో 10శాతం హామీలు కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశాడన్నారు. వచ్చే ఎన్నికలలో వైసీపీ పతనం తప్పదన్నారు. అందరూ ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి అంకాల్‌రెడ్డి, పత్తికొండ, ఆలూరు అసెంబ్లీ కన్వీనర్లు రంజిత్‌కర్ని, వెంకట్రాముడు, కోకన్వీనర్లు గోవర్ధన్, అంబన్నలతో పాటు ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పని చేయాలి

తుగ్గలి, ఫిబ్రవరి 5: మండల అధికారులు పార్టీలకతీతంగా పని చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్‌నాయుడు, మండల అధ్యక్షురాలు ఈరమ్మ, శ్రీనివాసులుగౌడు అన్నారు. సోమవారం తుగ్గలిలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ షర్మిళ, ఎంపీడీవో విజయలక్ష్మిని కలిసి సన్మానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయ్, సంగాల క్రిష్ణ, సత్య, నల్లగుండ్ల రవి, శ్రీరాములు, గిరిగిట్ల మల్లి, అంజి, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచులను అడ్డుకోవడం అన్యాయం

తుగ్గలి, ఫిబ్రవరి 5: సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న సర్పంచులను అడ్డుకోవడం అన్యాయమని టీడీపీ సర్పంచులు ఓబులేసు, రంగమ్మ, విజయ్‌లు అన్నారు. సోమవారం మండలంలోని జొన్నగిరి, చెన్నంపల్లి, సూర్యతాండ, ఎద్దులదొడ్డి, ముక్కెళ్ల, బొందిమడుగుల, కడమకుంట్ల సర్పంచులను సంబంధిత పోలీస్‌స్టేషన్లకు పిలిపించి అసెంబ్లీ ముట్టడికి వెళ్లకూడదని హెచ్చరించినట్లు సర్పంచులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు సుజాత, విజయలక్ష్మి, మస్తాన్‌బీ, తదితరులు ఉన్నారు.

గోనెగండ్ల: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం విజయవాడలో చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వెళ్తున్న టీడీపీ సర్పంచ్‌ను సోమవారం గోనెగండ్ల పోలీసులు అరెస్టు చేశారు. సర్పంచ్‌లకు పోలీసులు నోటీసులు అందజేశారు.

ఆలూరు: సర్పంచుల హక్కులు, అధికారాలు, నిధుల మంజూరు కోసం తలపెట్టిన చలో అసెంబ్లీ నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా ఆలూరు నియోజకవర్గంలోని టీడీపీ మద్దతు సర్పంచులను ఆలూరు పోలీసులు సోమవారం రాత్రి అదుపులో తీసుకున్నారు. సర్పంచులు మరకట్టు ఎల్లప్ప, మోహన్ రాజ్, నాగరాజు, డా. రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. నిధులు ఇవ్వకుండా అభివృద్ధి చేయడానికి అవకాశం లేకుండా చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు జగన్ ప్రభుత్వాన్ని సాగనంపుతారన్నారు.

కౌతాళం, ఫిబ్రవరి 5: అసెంబ్లీ సమావేశాలను అడ్డుకునేందుకు టీడీపీ సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి వెళ్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం పొదలకుంట సర్పంచ్ రంగస్వామి, తిప్పలదొడ్డి సర్పంచ్ భర్త, టీడీపీ నాయకుడు మల్లయ్య, గోతులదొడ్డి సర్పంచ్ భర్త, టీడీపీ నాయకుడు గోవిందులను స్టేషన్‌కు పిలిచి వారికి అసెంబ్లీ ముట్టడికి వెళ్లరాదంటూ నోటీసులు అందజేశారు.

హొళగుంద: సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో తలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ముందస్తు అరెస్టు చేయడంపై ఆదోని డివిజన్ సర్పంచ్ సంఘం నాయకులు జేకే సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీల నిధులు కాజేసి, సర్పంచ్‌లను దిష్టిబొమ్మలుగా చేసిన ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో సరైన గుణపాఠం చెబుతామని అన్నారు.

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

పెద్దకడుబూరు , ఫిబ్రవరి 5: నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాష,జిల్లా సహాయ కార్యదర్శి థామస్ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం పెద్దకడబూరులోని స్థానిక మోడల్ స్కూల్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తి స్థాయిలో తుంగలో తొక్కుతుందన్నారు. అనంతరం ఏఐఎస్ఏఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్, రాజు,హనుమంతు గౌస్, సుభాన్ పాల్గొన్నారు.

ఆసుపత్రి సమస్యలు తీర్చేందుకు సర్వేలు

గోనెగండ్ల, ఫిబ్రవరి 5: ప్రభుత్వ ఆసుపత్రుల సమస్యలను తెలుసుకొని ఆ సమస్యలను తీర్చేందుకు ఆరోగ్యశాఖ ఎన్‌క్యూఎఎస్ టీమ్‌ను తయారు చేసిందని ఆ కమిటీ సభ్యులు కృష్ణ ప్రసాద్, గణేష్‌నాగిరెడ్డి అన్నారు. సోమవారం గోనెగండ్లలోని ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. లేబర్‌వార్డు, ల్యాబ్‌గది, ఓపీ రూమ్‌లను పరిశీలించి వాటి పరిస్థితులను తెలుసుకొని నివేదిక తయారు చేశారు. ఎన్‌క్యూఎఎస్ టీమ్ ఢిల్లీ వైద్యబృందం ఆధ్వర్యంలో పర్యటిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సభ్యులలో ఒకరు తమిళనాడు, మరొకరు తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు రంగా రవళి సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి ఎంఈవోపై చర్యలు ఎప్పుడు?

గోనెగండ్ల, ఫిబ్రవరి 5: అవినీతి పాల్పడిన వినోద్‌కుమార్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆర్‌యూఎస్ఎఫ్ జిల్లా అధ్యకుడు రఘునాథ్ ప్రశ్నించారు. సోమవారం గోనెగండ్లలో ఆ సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జగనన్న విద్యాకానుకలో ఎంఈవో అవినీతికి పాల్పడినట్లు డిప్యూటీ డీఈవో విచారణలో తెలిసినప్పటికీ ఎందుకు ఆయన చర్యలు తీసుకోవడం లేదని వారు ప్రశ్నించారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాహుబాబు, రాజ్ కుమార్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టోపై ప్రచారం చేయాలి

ఆలూరు, ఫిబ్రవరి 5: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన మేనిఫెస్టోపై గ్రామాల్లో విస్తృతంగ ప్రచారం నిర్వహించాలని నియోజకవర్గ పరిశీలకులు ముంతాజ్ బేగం, శ్రీలక్ష్మి, సల్మాన్ రాజ్ సూచించారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యలయంలో నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ బూత్ కమిటీ లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి టీడీపీ అమలు చేయబయే పథకాలు వవరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, బూత్ కమిటీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా పోటీ కోసం దరఖాస్తు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 5: ఆదోని నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడానికి విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవిశెట్టి ప్రకాష్‌తో కలిసి దరఖాస్తు చేసుకున్నట్లు పార్టీ సీనియర్ నాయకుడు ఎంఎండీ నూర్ అహ్మద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాయలసీమలోని మైనారిటీలు అధికంగా ఉన్న నియోజకవర్గాలలో ఆదోని కూడా ఉండటంతో తాను పోటీకి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

కురువలకు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలి

ఆలూరు, ఫిబ్రవరి 5: కర్నూలు ఉమ్మడి జిల్లాలో 3.50 లక్షల ఓటర్లు ఉన్న కురువ సామాజికవర్గాలకు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లను ప్రధాన పార్టీల అధినేతలు కేటాయించాలని మాదాసి, మాదారి కురువ సంఘం నాయకులు మోహన్ ప్రసాద్ సోమవారం విజ్ఞప్తి చేశారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాలో రెండు ఎంపీ స్థానాలు, రెండు ఎమ్మెల్యే స్థానాలు ఇచ్చే పార్టీకే కురువల మద్దతు ఉంటుందన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం


దాతకు ప్రసాదాలను అందజేస్తున్న వెంకటేష్

శ్రీశైలం, ఫిబ్రవరి 5: శ్రీశైలం దేవస్థానం భక్తులకు నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద వితరణ పథకానికి ఆదోనికి చెందిన జి. రాజేష్ రెడ్డి అనే భక్తుడు కుటుంబ సమేతంగా కలిసి రూ. లక్ష విరాళాన్ని సహాయ కమిషనర్ వెంకటేష్‌కు అందజేశారు.